క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ ఛాంపియన్ షిప్‌లో శ్రేష్టకు గోల్డ్ మెడల్



ఘంటసాల: ఘంటసాల గ్రామానికి చెందిన గొర్రెపాటి శ్రేష్ట స్కేట్ చాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. ఎన్టీఆర్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి 7వ స్కేట్ చాంపియన్ షిప్ 2024–25లో సబ్ జూనియర్స్ విభాగంలో ఘంటసాల గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గొర్రెపాటి సురేష్ – కవితల కుమార్తె శ్రేష్ట ప్రథమ బహుమతిని గెలుచుకుంది. సోమవారం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో శ్రేష్టకు నిర్వాహకులు గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాన్ని అందించారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన భవిజ్ఞ



గోగినేనిపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కొడాలి భవిజ్ఞ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ చిత్తూరు జిల్లా అరగొండలోని ఈషా విద్యానికేతన్ ప్రాంగణంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి అండర్ –14 సాఫ్ట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన భవిజ్ఞ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ఆడనున్నట్లు చెప్పారు. భవిజ్ఞకు ఉత్తమ శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ గరికపాటి మారుతిని, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన భవిజ్ఞను హెచ్‌ఎం వేణుగోపాలరావుతో పాటు ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు అభినందించారు.

వక్తృత్వ పోటీలో ఎస్‌వీ హైస్కూల్ విద్యార్థిని ప్రతిభ

మచిలీపట్నంటౌన్: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల నగర, జిల్లా, ఆరు జిల్లాల పరిధిలో నిర్వహించిన వక్తృత్వ పోటీలో స్థానిక జవ్వారుపేటలోని శ్రీ వెంకటేశ్వర ఇంగ్లిషు మీడియం హైస్కూల్ విద్యార్థిని బండి స్నేహధరణి ప్రతిభ కనబర్చింది. నగర, కృష్ణాజిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన స్నేహధరణి ఆరు జిల్లాల(జోనల్–2) పరిధిలో తృతీయ స్థానాన్ని కై వసం చేసుకుంది. కాకినాడలో సోమవారం జరిగిన కార్యక్రమంలో స్నేహధరణికి విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి ప్రశంసా పత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.సత్యన్నారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

అవనిగడ్డ: స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన 29 మంది లబ్ధిదారులకు రూ.21 లక్షల విలువ గల చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకూ రూ.42లక్షల విలువగల చెక్కులను అందజేశామన్నారు. కార్యక్రమంలో గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్(రాజా) పాల్గొన్నారు.

వైద్యుడు శ్రీనివాసాచారికి సన్మానం



మచిలీపట్నం టౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు బి.శ్రీనివాసాచారిని జిల్లా గ్రామీణ వైద్యుల సంఘ నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. జవ్వారుపేటలోని శ్రీనివాసాచారి నివాసానికి వచ్చిన నాయకులు ఆయనకు శాలువా కప్పి, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘ నాయకులు నండూరి ఉమా శంకరరావు, ఎస్.ఉదయభాస్కరరాజు, కె.వెంకటేశ్వరరావు, అగ్నిహోత్రం ఫణిగోపాల్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులుంటే 1967కు కాల్ చేయండి

పెడన: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే సమయంలో ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉత్పన్నమైతే టోల్ ఫ్రీ నంబరు 1967 లేదా జిల్లా కంట్రోల్ నంబరు 82476 93551 కాల్ చేయాలని పెడన ఇన్‌చార్జి ఏవో నూరున్నీసా రైతులకు సూచించారు. ఆమె సోమవారం మండలంలోని కొంకేపూడి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

మల్లేశ్వరం వద్ద వరి కోతలు కోస్తున్న కూలీలు



- అనుకూలించిన వాతావరణం
- దాదాపు 40 శాతం కోతలు పూర్తి
- అక్టోబర్ వర్షాలకు దెబ్బతినని భూముల్లో దిగుబడులు ఆశాజనకం
- ఇంకా అందుబాటులో లేని రాయితీ మినుములు

ముమ్మరంగా సార్వా వరి కోతలు

బంటుమిల్లి: మండలంలో వాతావరణం అనుకూలంగా ఉండటంతో సార్వా వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రభుత్వం నుంచి దాళ్వాపై ప్రకటన వస్తుందని ఆశించిన రైతులు కోతలను అలస్యంగా చేపట్టారు. ఈ క్రమంలో ప్రభుత్వం దాళ్వా లేదంటూ ప్రకటన చేయడంతో ముందు అలస్యం చేసిన రైతులు గత కొద్ది రోజులుగా వరి కోతలు ముమ్మరం చేశారు. పంట కోస్తే అపరాల సాగుకు తేమ ఉండదని భావించిన రైతులు దాళ్వా లేదని వచ్చిన ప్రకటనతో కోతలు వేగిరం చేశారు. కూలీలు, మిషన్లతో ముమ్మరంగా చేపట్టారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో కోసిన ధాన్యాన్ని కల్లాల్లో, రోడ్లపైన ఎండబెట్టి తేమ శాతం పరిశీలించుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు తరలిస్తున్నారు. ఇప్పటికి దాదాపు 40 శాతం కోతలు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మండలంలో దాదాపు 5,200 హెక్టార్లలో సార్వా సాగు చేశారు. దాదాపు 2000 హెక్టార్లకు పైగా కోతలు పూర్తయ్యాయి. అక్టోబరు వర్షాలకు దెబ్బతినని భూముల్లో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరాకు 30 నుంచి 40 బస్తాలు అవుతున్నాయి. అక్టోబరు అధిక వర్షాలకు తడిసిన భూముల్లో ఎకరాకు 20 నుంచి 25 బస్తాల దాకా దిగుబడులు వస్తున్నాయి. మండలంలో తడిసిన 1500 ఎకరాలకు ప్రభుత్వం పంట నష్టపరిహారం ఎకరానికి రూ.10వేల చొప్పున మంజూరు చేసింది.

నేటికీ రైతుల వద్దకు చేరని రాయితీ మినుములు

మండలంలో రైతులు రెండో పంటగా సాగు చేయనున్న అపరాల రాయితీ విత్తనాలు నేటికీ రైతుల వద్దకు చేరలేదు. బంటుమిల్లి ప్రధాన కాలువ పరిధిలో రెండో పంట దాళ్వా లేదని తేల్చి చెప్పిన ప్రభుత్వం అపరాల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఒక పక్క కోతలు ముమ్మరంగా సాగుతున్నా రాయితీ విత్తనాల సరఫరాలో పాలకులు, అధికారులు మీనమేషాలు లెక్కపెడుతూ రైతుల గోడు పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. చౌడు భూముల్లో కోతలకు ముందే అపరాల విత్తనాలు నానబెట్టి చల్లుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో రైతులు బయట మార్కెట్లో అధిక ధరలు పెట్టి కొనుగోలు చేసి విత్తనాలు చల్లుతున్నారు. దీనిపై ఏఓ శివరామకృష్ణ మాట్లాడుతూ మండలానికి 80 క్వింటాళ్ల మినుము విత్తనాలు ఇండెంట్ పెట్టామని, రెండు రోజుల్లో విత్తనాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. రైతులకు కావలసిన వేరుశనగ విత్తనం ప్రభుత్వం వద్ద అందుబాటులో లేనందున ఇండెంట్ పెట్టలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాయితీ అపరాల విత్తనాలు వెంటనే రైతుల వద్దకు చేరేందుకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.4 లక్షలని మేం అనలేదు

మండల పరిషత్ సమావేశంలో గృహ నిర్మాణాలపై వాదోపవాదాలు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాణి

పెడన: పేదవాడి ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని మేం ఎక్కడా అనలేదని, సూపర్ సిక్స్‌లో కూడా ప్రకటించలేదని, మీరు ఇచ్చిన విధంగా రూ.1.80 లక్షలు లేదా అదనంగా మరో రూ.25వేలు వేసి ఇస్తామే తప్ప రూ.4 లక్షలు కాదని టీడీపీ జెడ్పీటీసీ సభ్యుడు అర్జా వెంకట నగేష్ స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ రాజులపాటి వాణి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణ శాఖపై చర్చ జరుగుతున్న సమయంలో ఉప్పలకలువగుంట సర్పంచ్ గుడిసేవ శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో రూ.4లక్షలు ఇస్తారని లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడం మానేశారని అన్నారు. దీంతో జెడ్పీటీసీ స్పందిస్తూ నాలుగు లక్షలు ఇస్తామని తాము ఎక్కడా అనలేదని అన్నారు. 2025 మార్చి లోగా ప్రస్తుత లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకోకపోతే వారికి ఇక ఎప్పటికీ ఇల్లు మంజూరు కావని, లబ్ధిదారులు తప్పనిసరిగా ఇళ్లను నిర్మించుకోవాల్సిందేనన్నారు. ఎంపీపీ వాణి మాట్లాడుతూ బదిలీపై నూతనంగా వచ్చిన అధికారులు కనీసం ప్రొటోకాల్ ప్రకారం కూడా కలవకపోవడం బాధాకరమన్నారు. ఇన్‌చార్జి వ్యవసాయశాఖ అధికారి అసలు వస్తున్నారో లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు, సబ్సిడీ అపరాల విత్తనాలపై మాట్లాడదామంటే ఆమె రాలేదని, నందమూరు ఎంపీఈవోను పంపించడంపై సభ్యులు మండిపడ్డారు. పూర్తి వివరాలతో వచ్చి కలవాల్సిందిగా ఇన్‌చార్జి ఎంపీడీవో జయరాంకు ఎంపీపీ సూచించారు.

ధాన్యం తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది

వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని పెనుమల్లి సర్పంచ్ గరికిపాటి వెంకట రామానాయుడు అన్నారు. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎక్కడెక్కడ పెట్టిందనే వివరాలతో పాటు మద్దతు ధర ఎంత ఇస్తామనే దానిపై రైతులకు తెలిసేలా ప్రచారం చేయాలని కోరారు. ఇరిగేషన్, విద్యుత్, పశు సంవర్ధక శాఖ, వైద్యం, ఐసీడీఎస్ తదితర శాఖలపై సమీక్షించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు యాదంరెడ్డి వర ప్రసాదరావు, పరసా వాకలమ్మ, ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్చుతరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పీఠికను ప్రతి ఒక్కరూ చదవాలి

కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): ఈ నెల 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ రాజ్యాంగ పీఠికను చదివేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు మొదలైన వాటిలో రాజ్యాంగ పీఠికను చదవాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలన్నారు. ఇందుకు సంబంధించి జెడ్పీ సీఈవో, డీపీవో పంచాయతీ స్థాయిల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రత్యేక గ్రామసభలుగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

రూ.కోటి విరాళమిచ్చిన దంపతులకు ఘన సత్కారం

మెండు శివరామప్రసాద్ దంపతులను సన్మానించిన ఎమ్మెల్యే మండలి



దాత మెండు శివరామప్రసాద్ దంపతులను సన్మానించిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

టి.కొత్తపాలెం(నాగాయలంక): గ్రామంలోని పురాతనమైన శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో దాతలు సుమారు కోటి రూపాయల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి, ఆలయ ముఖ మండపం ఆవిష్కరణ రెండో రోజు కార్యక్రమంలో సోమవారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి దాతలైన మెండు శివరామప్రసాద్, విజయలక్ష్మి దంపతులను గ్రామస్తులు, దేవదాయ శాఖ తరఫున ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఘనంగా సన్మానించారు. భూరి విరాళంతో దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసిన దాతల ఔదార్యాన్ని కొనియాడారు. అంతకు ముందు ఉత్సవంలో భాగంగా యాగశాలలో రుద్ర హోమం, చండీ హోమం, మహా పూర్ణాహుతి జరిపారు. అనంతరం భక్తులకు కార్తిక వన సమారాధన భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై రైతులకు శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త సుధారాణి

రావివారిపాలెం(మోపిదేవి): మినుము పంటను ఆశించే చీడపీడల యాజమాన్యంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం ఘంటశాల వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ డి.సుధారాణి అన్నారు. మండలంలోని రావివారిపాలెం గ్రంథాలయం ప్రాంగణంలో సోమవారం రైతులకు చీడపీడల నివారణపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మినుము పంటను ఆశించి రసం పీల్చే పురుగులు తెల్లదోమ, పేనుబంక, తామర పురుగుల ద్వారా వ్యాప్తి చేసే వైరస్ తెగుళ్లను రైతులకు క్షుణ్ణంగా వివరించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి, మరో శాస్త్రవేత్త వెంకటలక్ష్మి రైతులకు చీడపీడల నివారణ పద్ధతులను తెలియజేశారు.

ఫెడరల్ బ్యాంకు శాఖ ప్రారంభం



ఫెడరల్ బ్యాంక్ శాఖను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న రీజనల్ హెడ్ జయశేఖరరెడ్డి

మచిలీపట్టణంటౌన్: నగరంలోని చల్లరాస్తా సెంటర్ సమీపంలో ఫెడరల్ బ్యాంకు నూతన శాఖను ఆ బ్యాంక్ రీజనల్ హెడ్ జయశేఖరరెడ్డి సోమవారం ప్రారంభించారు. నూతన శాఖ మేనేజర్ సారథిరెడ్డి మాట్లాడుతూ తమ బ్యాంకులో లాకర్ సౌకర్యం, ఎన్‌ఆర్‌ఐ సేవలు కూడా అందిస్తామన్నారు. కృష్ణా జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మద్దుల గిరీష్ కుమార్, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణేశ్వరరావు, చార్టెడ్ అకౌంటెంట్ కె.శివరామకుమార్, కొత్తగుండు రమేష్, ఉదయగిరి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాతీరాన కార్తిక పుణ్యస్నానాల సందడి



శ్రీరామపాదక్షేత్రంలో రామలింగేశ్వరునికి గంధం అభిషేకిస్తున్న దాత దంపతులు



30కేజీల పంచదారతో అభిషిక్తుడైన భావదేవరపల్లి కాశీవిశ్వేశ్వరుడు



ఉల్లిపాలెంలో కార్తికదీపాలు వెలిగిస్తున్న భక్తులు

నాగాయలంక: నాగాయలంక కృష్ణానది తీరంలోని శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌లో శ్రీరామ లింగేశ్వర స్వామి మండపంలో సోమవారం గరళకంఠుడికి 250 కిలోల గంధంతో సోమవారం రాత్రి జరిపిన మహా గంధమాభిషేకం భక్తులకు కనువిందు చేసింది. దాతలు వేములపల్లి ప్రసాద్, సబ్బినేని రామకిశోర్ చెరో 36 కేజీల గంధం ఇవ్వగా, అనేక మంది భక్తుల ఆర్థిక సౌజన్యంతో మొత్తంగా 250 కిలోల గంధం సమకూర్చగా మహాదేవుడికి దాతలు గంధంతో మహాభిషేకం చేశారు. అనంతరం మండపం ఎదుట ప్రత్యేక స్తంభంపై ఉంచిన కోటివత్తులకు వత్తి దాత ఉడత ముత్తయ్య– నాగలక్ష్మి కుటుంబం (గుంటూరు వాస్తవ్యులు) జ్యోతి ప్రజ్వలన చేశారు. పుష్కర ఘాట్ వద్ద తెల్లవారుజామునే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కృష్ణా నదిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం నది దీపాలు వెలిగించారు.

ఉభయ ముక్తేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

వేకనూరు(అవనిగడ్డ): వేకనూరులో ఉన్న పార్వతీ సమేత ఉభయ ముక్తేశ్వరాలయంలో స్వామివారికి సోమవారం లక్ష బిల్వార్చన కార్యక్రమం జరిగింది. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. రుద్రాభిషేకాలు, లక్ష బిల్వాలతో అభిషేకాలు చేశారు.

30 కేజీల చక్కెరతో అభిషేక అలంకరణ

భావదేవరపల్లి(నాగాయలంక): కార్తిక సోమవారం పర్వదినం పురస్కరించుకుని స్థానిక శ్రీఅన్నపూర్ణ సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామికి 30 కేజీల పంచదారతో అభిషిక్తుడిని చేసి సుందరంగా అలంకరించారు. నాగాయలంకలోని పురాతనమైన శ్రీవల్లీ దేవసేన శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు జరిపి పారిజాత పుష్పాలంకరణ చేశారు. శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో శ్రీనగరేశ్వరుడిని ఆవునెయ్యి, ఆవుపాలు, తేనె, పంచదార, పసుపు కుంకుమలతో అభిషేకించి బిల్వపత్రాలతో అలంకరించారు.

పరమేశ్వరునికి లక్ష బిల్వార్చన

కృత్తివెన్ను: కార్తిక మాసం నాల్గవ సోమవారం కృత్తివెన్ను శివాలయంలో స్వామివారికి లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయం వద్ద కార్తిక వన సమారాధన ఘనంగా జరిగింది. కృత్తివెన్ను శివాలయం, చినపాండ్రాక అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. గాంధీనగరం గ్రామంలోని అభయసిద్ధి విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద కోటి దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. దీపాలు, పుష్పాలతో అలంకరించిన శివలింగం భక్తులను ఆకట్టుకుంది.

పుణ్యక్షేత్రంలో కార్తిక శోభ

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం భక్తజనం పోటెత్తారు. తెల్లవారుజామున స్వామివారిని దర్శించుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపాలు వెలిగించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం దేవస్థానం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

పెడన: పట్టణంలోని శ్రీగంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి వారి దేవస్థానంతో పాటు మండల వ్యాప్తంగా పలు శైవక్షేత్రాలలో కార్తిక మాసం ఆఖరి సోమవారం భక్తులు పోటెత్తారు. భక్తులు వేకువ జామునే చన్నీటితో స్నానాలు ఆచరించి దేవాలయాలకు చేరుకుని ధ్వజస్తంబం వద్ద గణనాథుని సన్నిధిలో దీపారాధన చేశారు. అనంతరం కొందరు ఆలయం వెనుక ఆవరణలో 365 వత్తులతో దీపాలను వెలిగించారు. మరికొందరు విఘ్నేశ్వర పూజ అనంతరం శివునికి అభిషేకాలు చేయించారు. .

రెవెన్యూ సిబ్బంది కార్తిక వన సమారాధన

మోపిదేవి: మోపిదేవి తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సమారాధనలో తహసీల్దార్ శ్రీవిద్య, డెప్యూటీ తహసీల్దార్ వాణి, ఇన్‌చార్జి ఆర్‌ఐ మోపిదేవి శ్రీనివాసరావు, వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అభినవ మేల్కోటలో కార్తిక దీపకాంతులు

కోడూరు: అభినవ మేల్కోటగా ప్రసిద్ధిగాంచిన ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయం సోమవారం కార్తిక దీపకాంతులతో దేదీప్యమానంగా వెలుగొందింది. భక్తులు ఎనిమిది వేల కార్తికదీపాలను వెలిగించి భక్తిభావం చాటుకున్నారు. అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజీయర్ స్వామిజీ పర్యవేక్షణలో ఈ దీపోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ – విజయలక్ష్మి దంపతులు దీపోత్సవంలో పాల్గొని కార్తికదీపాలను వెలిగించారు. అనంతరం స్వామివార్ల ఉత్సవమూర్తులకు నగరోత్సవాన్ని నిర్వహించారు. బుద్ధప్రసాద్ దంపతులు శ్రీమన్నారాయణుడికి ప్రత్యేక పూజలు చేశారు. అష్టాక్షరీ స్వామిజీ వారిని శేషవస్త్రంతో సత్కరించారు.

- **రైతులు అప్రమత్తంగా ఉండాలి**

పెడన: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశాలున్నాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం రైతులు అప్రమత్తంగా ఉండాలని పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోతలు కోయవద్దని, కోసిన వాటిని త్వరితగతిన తేమ తగలని ప్రాంతాలకు తరలించుకోవాల్సిందిగా సూచించారు. మంగళవారం నుంచే వర్షాలు పడే అవకాశాలున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా నడుచుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

- **పొల్లాలో విద్యుత్ మోటార్లను తాకొద్దు**

కోసూరువారిపాలెం(మోపిదేవి): రైతులు తమ పొల్లాలో స్టార్టర్ ఆన్ చేసినా మోటార్ ఆన్ అవకపోతే ఎట్టి పరిస్థితుల్లో మోటారును తాకవద్దని విద్యుత్ శాఖ డెప్యూటీ ఈఈ పుల్లి శివనాగేశ్వరరావు సూచించారు. ఆదివారం కోసూరువారిపాలెంలో రైతు కోసూరు రమేష్‌బాబు పొలంలో మోటారు వద్ద విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన విషయం తెలిసిందే. సమాచారం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఈఈ సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు రమేష్‌బాబు మోటారు స్విచ్ ఆన్ చేసిన తర్వాత అప్పటికే కాలిపోయి ఉన్న విద్యుత్ మోటారును తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెంది ఉంటారని గుర్తించినట్లు వివరించారు. మండల విద్యుత్‌శాఖ ఏఈ పాండురంగారావు, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

- **మినుము విత్తనాలు పంపిణీ**

రావివారిపాలెం(మోపిదేవి): కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులకు వెన్నుదన్నుగా ఉంటూ, వరి ధాన్యం ఎక్కడ మంచి ధర ఉంటే అక్కడ అమ్ముకునే అవకాశం కల్పించినట్లు జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు తెలిపారు. రావివారిపాలెం రైతు సేవా కేంద్రంలో మినుము విత్తనాలను సోమవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి హెప్సిబా రాణి మాట్లాడుతూ రబీలో వేసుకునే మినుము విత్తనాలు రైతు సేవా కేంద్రంలో 40 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కేజీ మినుము విత్తనం ధర రూ.98 కాగా, 4 కిలోల బ్యాగ్‌లు రూ.392లకు విక్రయిస్తున్నట్లు వివరించారు. అవసరమైన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

- **అన్నపై తమ్ముడు దాడి**

పెడన: ఆస్తి విషయంలో అన్నపై తమ్ముడు దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. పెడన పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అన్నదమ్ములిద్దరూ పోలీస్‌శాఖలో ఉద్యోగులు. అన్న వూచ సత్యనారాయణ మచిలీపట్నంలో నివాసం. తమ్ముడు వూచా నాగభూషణం విజయవాడలో ఉంటున్నారు. సొంత ఊరు పెడన మండలం నేలకొండపల్లి. ఆదివారం నేలకొండపల్లి గ్రామంలోని తల్లిని చూసేందుకు ఇద్దరూ వెళ్లారు. అన్న సత్యనారాయణను మాట్లాడదామని తమ్ముడు నాగభూషణం బయటకు పిలిచి అన్నపై దాడి చేయడంతో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. సత్యనారాయణ మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు సత్యనారాయణ ఫిర్యాదుతో ఎస్‌ఐ–2 రాజేంద్రప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్తంగా...

- **పేదలకు వస్త్ర, అన్నదానం**



నాగాయలంక: కార్తిక మాసం ఆఖరి సోమవారం పురస్కరించుకుని స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో నిత్య అన్నదాన సేవా కమిటీ ఆధ్వర్యంలో 40 మంది పేద వృద్ధులు, దివ్యాంగులకు నూతన దుస్తుల వితరణతో పాటు అన్నదానం నిర్వహించారు. కార్తిక మాసంలో నెల మొత్తం అన్నదాతలుగా వ్యవహరించిన 60 మంది దాతల ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ దుస్తులను అన్నదాన సేవకుల చేతులమీదుగా అందజేశారు. దుస్తుల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలలో నిర్వాహక ప్రతినిధులు, పొన్నపల్లి చిన్నా, లంకమ్మ, సబ్బినేని రాణి, మత్తి శేషుబాబు, ఆకురాతి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

- **వయోజనులందరికీ చదువు నేర్పించాలి**

ఘంటసాల: నిరక్షరాస్యులుగా గుర్తించిన వయోజనులందరికీ చదువు నేర్పించాలని ఎంపీడీవో డి.సుబ్బారావు అన్నారు. ఘంటసాల వెలుగు కార్యాలయంలో ఏపీ వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఏపీఎం ఎం.పాండురంగప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ట్రైనర్ కె.సురేష్ మోహన్ వీఓలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీసీలు, వీఏఓలు పాల్గొన్నారు.

- **పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి**

పెడన: డిసెంబరులో జరగనున్న పైడమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని పారిశుద్ధ్య పనులను బాధ్యతగా నిర్వహించేలా చూడాలని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. సోమవారం చైర్‌పర్సన్ చాంబరులో మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావుతో కలిసి శానిటేషన్ కార్యదర్శులు, వార్డు మేస్త్రిలతో పారిశుద్ధ్యంపై సమీక్షించారు. డిసెంబరు 14 నుంచి 24వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి చేయాలన్నారు.

- **నేడు డయల్ యువర్ డీఎం**

మచిలీపట్నంటౌన్: ఏపీఎస్‌ఆర్టీసీ మచిలీపట్నం డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారం, సలహాల కోసం ఈ నెల 26వ తేదీ మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం టి.పెద్దిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య 99592 25462 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు తెలపాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

- **పాడి పశువులకు టీఎంఆర్ దాణా పంపిణీ**

నాగాయలంక: స్థానిక ప్రభుత్వ పశువైద్యశాల ఆధ్వర్యంలో మండలంలో పాడి పశువులలో మెరుగైన పాల ఉత్పత్తికి ఉపయోగపడే టోటల్ మిక్స్‌డ్ రేషన్(టీఎంఆర్) సోమవారం రైతులకు పంపిణీ చేశారు. పశుసంవర్ధక శాఖ ద్వారా ఇండెంట్ బుక్ చేసుకున్న రైతులకు సబ్సిడీపై రూ.1300కు(అసలు ధర రూ.3160) ప్రభుత్వం అందిస్తుందని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సాయి మానిక చెప్పారు. టీఎంఆర్ బ్యాగ్‌లను జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, మండల టీడీపీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు చేతుల మీదుగా రైతులకు అందజేశారు.

- **నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం**

పెడన: పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవం పెడన మండలం బల్లిపర్రు గ్రామంలో మంగళవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ కుటుంబ శ్రేణులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

- **నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం**

పెడన: పెడన పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం, 12 గంటలకు అత్యవసర సమావేశం ఉంటాయన్నారు. కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా కోరారు. ప్రత్యేక సమావేశంలో 2025–26 ఏడాదికి సంబంధించి బడ్జెట్ అంచనాల ఆమోదంపై అజెండా కౌన్సిల్ ముందుకు రానుంది. అనంతరం అత్యవసర సమావేశంలో పారిశుద్ధ్యంపై పలు తీర్మానాలు రూపొందించి కౌన్సిల్ ఆమోదం పొందనున్నారు.